సాక్షి
యాదాద్రి భువనగిరి
మంగళవారం। 11। ఫిబ్రవరి। 2025



23న మహాకుంభ సంప్రోక్షణ
యాదగిరిగుట్ట ఆలయ దివ్య విమాన స్వర్ణ గోపురానికి ఈనెల 23న మహాకుంభ సంప్రోక్షణ నిర్వహించనున్నారు. - 8లో



పెద్దగట్టుకు పోదాం ఇలా..
దురాజ్‌పల్లిలోని లింగమంతుల స్వామి జాతరకు సంబంధించిన రూట్‌మ్యాప్‌ను అధికారులు సిద్ధం చేశారు. - 8లో



ఆ కంపెనీ మాకొద్దు
టైర్ల రీసైక్లింగ్ కంపెనీ తమకొద్దంటూ మోట కొండూరు మండలం కాటేపల్లి గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. - 9లో

న్యూస్‌రీల్

మూడో విడత 'రైతుభరోసా' విడుదల

భువనగిరిటౌన్ : రైతుభరోసా మూడో విడత నిధులను ప్రభుత్వం విడుదల చేసింది. సోమవారం రెండు ఎకరాల లోపు ఉన్న 9,151 మంది రైతుల ఖాతాల్లో రూ.7,18,36,017 నగదు జమ అయ్యాయి. గత నెల 26న మొదటి విడత, ఈనెల 5వ తేదీన రెండో విడత నిధులు విడుదల చేసిన విషయం తెలిసిందే. మూడు విడతల్లో 32,946 మంది రైతులకు రూ.53.64 కోట్ల పెట్టుబడి సాయం అందజేసింది.

శివకేశవులకు సంప్రదాయ పూజలు



శివాలయంలోని స్పటిక లింగానికి పూజలు చేస్తున్న అర్చకుడు

యాదగిరిగుట్ట : యాదగిరి క్షేత్రానికి అనుబంధంగా కొండపైన కొలువైన శ్రీపర్వత వర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం సంప్రదాయ పూజలు నిర్వహించారు. స్వామివారికి ఇష్టమైన రోజు కావడంతో రుద్రాభిషేకం, బిల్వార్చన, ఆలయ ముఖ మండపంలో స్పటిక లింగానికి పూజలు చేశారు. ఆయా పూజల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఇక ప్రధానాలయంలో నిత్యారాధనలు కొనసాగాయి. వేకువ జామున సుప్రభాతం సేవ, గర్భాలయంలో స్వయంభూలకు అభిషేకం, అర్చన, ప్రాకార మండపంలో సుదర్శన నారసింహహోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, ముఖ మండపంలో అష్టోత్తరం తదితర పూజలు చేపట్టారు.

యాదగిరి క్షేత్రంలో ఇద్దరు ఉద్యోగుల సస్పెన్షన్

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహ స్వామి క్షేత్రంలో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు ఉద్యోగులను సస్పెన్షన్‌కు గురైనట్లు తెలుస్తోంది. సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రావ్య అనుమతి లేకుండా కొద్ది రోజులుగా విధులకు రావడం లేదు. అదే విధంగా కొండపైకి వెళ్లే వాహనాల నుంచి వసూలు చేసిన రుసుమును రికార్డు అసిస్టెంట్ నర్సింగరావు ఆలయానికి చెల్లించడం లేదు. దీంతో ఇద్దరిని దేవస్థానం ఈఓ భాస్కర్‌రావు సస్పెండ్ చేసినట్లు తెలిసింది.

కాంగ్రెస్ బీసీల ద్రోహి



విలేకరులతో మాట్లాడుతున్న భిక్షమయ్యగౌడ్

సాక్షి, యాదాద్రి : కులగణన పేరుతో బీసీలకు మోసం చేసిన కాంగ్రెస్ పార్టీ.. మరోసారి ద్రోహిగా మిగిలిందని ఆలేరు మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్ ఆరోపించారు. సోమవారం భువనగిరిలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2011 జనాభా లెక్కల ప్రకారం బీసీల జనాభా 2024 నాటికి పెరగాలే కాని ఎలా తగ్గిందని ప్రశ్నించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు ప్రభుత్వం చట్టబద్ధత ఎందుకు కల్పించలేదన్నారు. బీసీ లెక్కలు తప్పుల తడకగా ఉన్నాయని, సరి చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థ ఎన్నికలకు వెళ్లడాన్ని బీఆర్ఎస్ అంగీకరించబోదన్నారు. బీసీ కులగణన తప్పని కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీనే ప్రతులను తగులబెట్టిన విషయాన్ని భిక్షమయ్యగౌడ్ గుర్తు చేశారు. బీసీలకు చేస్తున్న అన్యాయాలపై గ్రామ సభలు పెట్టి చైతన్యం చేస్తామన్నారు. బీసీలకు కేసీఆర్ ఎంతో చేశారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ 50 శాతం టికెట్లు బీసీలకు కేటాయిస్తుందన్నారు. విలేకర్ల సమావేశంలో మాజీ గ్రంథాలయ చైర్మన్ డాక్టర్ జడల అమరేందర్, మున్సిపల్ మాజీ చైర్మన్లు ఎనబోయిన అంజనేయులు, వస్పరి శంకరయ్య, మాజీ జెడ్పీటీసీలు బీరుమల్లయ్య, బొట్ల పరమేశ్వర్,మొగుళ్ల శ్రీనివాస్, తోటకూర అనురాధ, నాయకులు కర్రె వెంకటయ్య, బబ్బూరి రవీంద్రనాథ్‌గౌడ్, కొలుపుల హరినాథ్, నీల ఓం ప్రకాశ్‌గౌడ్, గడ్డమీది రవీందర్‌గౌడ్, పెంటనర్సింహ, అబ్బగాని వెంకట్ పాల్గొన్నారు.

మళ్లీ దరఖాస్తు చేయనవసరం లేదు

భువనగిరిటౌన్ : రేషన్ కార్డుల కోసం ప్రజాపాలన, గ్రామసభలతో పాటు మీసేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకున్న వారు మళ్లీ దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదని అదనపు కలెక్టర్ వీరారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పౌర సరఫరాల శాఖ సూచన మేరకు మీసేవ పోర్టల్‌లో ఆహార భద్రత (రేషన్)కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. గతంలో దరఖాస్తు చేసుకోనివారు మాత్రమే అర్హులన్నారు.





కల్యాణ వైభోగమే..
యాదగిరి పాతగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి నిర్వహించిన స్వామి, అమ్మవారి తిరుకల్యాణానికి గజవాహన సేవకు ముందు పట్టు వస్త్రాలతో వస్తున్న కలెక్టర్ హనుమంతరావు, ఈఓ భాస్కర్‌రావు, ఆలయ అనువంశిక ధర్మకర్త నరసింహమూర్తి దంపతులు

కల్యాణతంతు నిర్వహిస్తున్న అర్చకులు

చేజిక్కించుకునేలా!

స్థానిక సంస్థల్లో పట్టుకు కాంగ్రెస్ వ్యూహం

- 90 శాతం సీట్లు సాధించడమే లక్ష్యంగా కార్యాచరణ
- అభ్యర్థుల గెలుపు బాధ్యతలు ఎమ్మెల్యేలకు
- క్షేత్ర పర్యటనలు, కార్యకర్తలతో సన్నాహక సమావేశాలకు సమాయత్తం



సాక్షి, యాదాద్రి : స్థానిక సంస్థల ఎన్నికలపై అధికార కాంగ్రెస్ పార్టీ ఫోకస్ పెట్టింది. మెజార్టీ స్థానాలను కైవసం చేసుకుని స్థానిక సంస్థల్లోనూ పట్టు పెంచుకోవాలనే లక్ష్యంతో ముందుకెళ్తోంది. త్వరలో ప్రాదేశిక ఎన్నికలకు నోటిఫికేషన్ రానున్న నేపథ్యంలో కేడర్‌ను సన్నద్ధం చేయడంతో పాటు అభ్యర్థుల గెలుపు బాధ్యతలను రాష్ట్ర నాయకత్వం ఎమ్మెల్యేలపై మోపింది. అనుసరించాల్సిన వ్యూహంపై ఇటీవల జరిగిన సీఎల్పీ సమావేశంలో వారికి దిశానిర్దేశం చేసింది. ఈ మేరకు ఎమ్మెల్యేలు క్షేత్ర పర్యటనలు, సన్నాహక సమావేశాలకు సమాయత్తం అవుతున్నారు.

పనితీరు ప్రామాణికంగా..

జిల్లాలోని 178 ఎంపీటీసీలు, 17 జెడ్పీటీసీ స్థానాలు, 428 గ్రామ పంచాయతీలకు త్వరలో ఎన్నికలు జరగనున్నాయి. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో వరుస విజయాలతో ఊపుమీదున్న కాంగ్రెస్.. స్థానిక పోరులోనూ అదే జోరు కొనసాగించాలన్న పట్టుదలతో ఉంది. అందుకోసం కీలకమైన అభ్యర్థుల ఎంపికలో ఆచితూచి నిర్ణయం తీసుకోవాలన్న యోచనలో ఉంది. పెద్దల అండ ఉంటే చాలూ.. టికెట్ వస్తుందన్న అభిప్రాయానికి ఈసారి పార్టీ నాయకత్వం చెక్ పెట్టనుంది. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో కేడర్ పనితీరు ప్రామాణికంగా, కొత్తగా పార్టీలో చేరిన వారిని సమన్వం చేసుకుంటూ అభ్యర్థులను బరిలోకి దింపే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.

ఆశావహులు ఫుల్

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో జిల్లా రాజకీయాల్లో మార్పులు చోటు చేసుకున్నాయి. ఇతర పార్టీల్లోని ద్వితీయ శ్రేణి నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. వీరిలో పలువురు మున్సిపల్ చైర్మన్ పదవులు, ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలను ఆశిస్తున్నారు. కాగా పదేళ్ల అధికారంలో లేకున్నా పార్టీని వెన్నంటి ఉన్న కేడర్‌లో చాలామంది బరిలోకి దిగేందుకు సిద్ధంగా ఉన్నారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు పార్టీ గుర్తుపై జరుగనుండడంతో టికెట్ సాధిస్తే గెలుపు నల్లేరుపై నడకేనన్న ధీమా వారిలో వ్యక్తమవుతోంది. రిజర్వేషన్లు ఖరారు కానప్పటికీ తమ వర్గానికి వస్తుందన్న అంచనాతో టికెట్ కోసం ప్రయత్నాలు ప్రారంభించారు. ఈ క్రమంలో ఎమ్మెల్యేల క్యాంపు కార్యాలయాలు, ఇళ్ల వద్దకు ఆశావహుల తాకిడి మొదలైంది. ఎమ్మెల్యేలు మాత్రం పాత, కొత్త వారిని సమన్వయం చేసుకుని గెలుపుగుర్రాలకు టికెట్‌లు ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. రంగం సిద్ధమైంది.

అందరి చూపు రిజర్వేషన్ల వేపై..

ప్రస్తుతం అందరి చూపు బీసీ రిజర్వేషన్లపైనే ఉంది. ప్రభుత్వానికి డెడికేటెడ్ బీసీ కమిషన్ నివేదికను సమర్పించింది. దీని ప్రకారం మండలం యూనిట్‌గా ఎంపీటీసీలు, జిల్లా యూనిట్‌గా జెడ్పీటీసీ రిజర్వేషన్లు, రాష్ట్రం యూనిట్‌గా జెడ్పీ చైర్మన్ల రిజర్వేషన్లు ఖరారు కానున్నాయి. అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీలో ఆశావహులు ఇప్పటికే టికెట్ కోసం ప్రయత్నాలు ప్రారంభించారు. అయితే రిజర్వేషన్లు ఎలా ఉంటాయోనన్న ఉత్కంఠ ఆశావహుల్లో నెలకొంది. వారంతా రిజర్వేషన్ల కోసం ఎదురుచూస్తున్నారు.

పద్ధతి మార్చుకోకుంటే చర్యలు తప్పవు

- కలెక్టర్ హనుమంతరావు
- జనంపల్లి గురుకుల పాఠశాల తనిఖీ



తరగతి గదిలో విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్

రామన్నపేట : మండలంలోని జనంపల్లి బాలికల గురుకుల పాఠశాలను సోమవారం కలెక్టర్ హనుమంతరావు ఆకస్మిక తనిఖీ చేశారు. పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా ఉండడం, నీళ్ల ట్యాంకుల్లో బొద్దింకలు, జెర్రీలు చనిపోయి ఉండడంతో ప్రిన్సిపాల్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. చిన్న వ్యవస్థపై కూడా సరైన పర్యవేక్షణ లేకపోతే ఎలా అని అసహనం వ్యక్తం చేశారు. అనంతరం తరగతి గదుల్లోకి వెళ్లగా విద్యార్థులు సమస్యలు ఏకరువు పెట్టారు. తరగతి గదులు, బాత్రూంలను తమతోనే శుభ్రం చేయిస్తున్నారని, కాస్మోటిక్ చార్జీల్లో రూ.3 కోత విధిస్తున్నారని, నాసిరకం కూరగాయలతో భోజనం పెడుతున్నారని, నీటికాలుష్యం వల్ల దురద వస్తుందని, కోతుల దాడిలో గాయాలు అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ముదిరిన కూరగాయలు, పెద్దసైజులో ఉన్న వంకాయ, ఆలుగడ్డ ముక్కలను తినలేక పడవేస్తే పరుష పదజాలంతో దూషిస్తున్నారని విద్యార్థులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. బాత్‌రూంలు శుభ్రంగా ఉండడం లేదని, ఫ్యాన్లు, లైట్లు పనిచేయడం లేదని, డార్మిటరీలు లేక తరగతి గదుల్లోనే పడుకోవాల్సి వస్తుందని, పడుకునే గదులకు బాత్‌రూంలు దూరంగా ఉండడం వల్ల రాత్రి సమయంలో ఇబ్బంది పడుతున్నామని మొర పెట్టుకున్నారు.

ఉపాధ్యాయులతో సమావేశం

ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులతో కలెక్టర్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. శ్రమదానం పేరుతో విద్యార్థులను బాలకార్మికులుగా మారుస్తారా?, ఫంక్షన్ల పేరుతో డబ్బులు ఎలా వసూలు చేస్తారంటూ.. మందలించారు. పేదపిల్లలను చూసుకునే పద్ధతి ఇదేనా అని అసహనం వ్యక్తం చేశారు. జిల్లాలో ఫిర్యాదులు వస్తున్న ఏకైక పాఠశాల ఇదేనని, మీ పనితీరు వల్ల జిల్లాకు, ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పనితీరు మారకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు.ఆయనవెంట ఆర్డీఓ శేఖర్‌రెడ్డి తహసీల్దార్ సి.లాల్‌బహదూర్, ఎంపీడీఓ బి.యాకుబ్‌నాయక్, పీఆర్ఏఈ గాలయ్య తదితరులు ఉన్నారు.

నిచ్చెన ఎక్కి.. ట్యాంకులను పరిశీలించి

విద్యార్థుల ఫిర్యాదు మేరకు కలెక్టర్ హనుమంతరావు పాఠశాల ఆవరణలోని నీటి సంపును పరిశీలించారు. అనంతరం నిచ్చెన తెప్పించి భవనంపైకి ఎక్కి బాత్‌రూంలకు నీటిని సరఫరా చేసే ట్యాంకులను చూశారు. పురుగులు, చెత్తా, చెదారం ఉండడంతో అసహనం వ్యక్తం చేశారు. తక్షణమే శుభ్రం చేయాలని ఆదేశించారు.



భవనంపైన నీటి ట్యాంకులను పరిశీలించి నిచ్చెన ద్వారా కిందికి దిగుతున్న కలెక్టర్

హెల్త్‌క్యాంప్ ఏర్పాటు చేయాలని డీఎంహెచ్‌ఓకు ఆదేశం

పాఠశాలలో తక్షణమే మెగా హెల్త్‌క్యాంప్ ఏర్పాటు చేసి ప్రతి విద్యార్థికి వైద్య పరీక్షలు నిర్వహించాలని జిల్లా వైద్యాధికారిని ఫోన్‌లో ఆదేశించారు. రక్తపరీక్షలు నిర్వహించి హిమోగ్లోబిన్ శాతం కూడా పరిశీలించాలని తెలిపారు. మంగళవారం స్పెషల్‌గా శానిటేషన్ డ్రైవ్ నిర్వహించాలని ఎంపీడీఓ యాకుబ్ నాయక్ ఆదేశించారు. నల్లాలు, ఫ్యాన్లు మరమ్మతులు, లైట్ల కోసం ప్రతిపాదనలు పంపాలని పీఆర్ఏఈ గాలయ్యకు సూచించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. పాఠశాల నిర్వహణలో పూర్తిగా నిర్లక్ష్యం కనిపిస్తుందని, బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. కోతుల బెడద నివారణకు సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు కోసం అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. త్వరలో తల్లితండ్రులతో సమావేశం ఏర్పాటు చేస్తామని చెప్పారు. వారానికి రెండుసార్లు తహసీల్దార్, ఎంపీడీఓలు పాఠశాలను సందర్శించి నివేదిక పంపిస్తారని తెలిపారు. విధుల్లో అలసత్వం వహించే వారిని ఉపేక్షించబోమని స్పష్టం చేశారు.

'ప్రాదేశిక' ఓటర్ల జాబితా ప్రదర్శన

- నేడు పోలింగ్ కేంద్రాల ముసాయిదా వెల్లడి



భువనగిరి ఎంపీడీఓ కార్యాలయంలోని నోటీస్ బోర్డుపై ఓటర్ల జాబితా ప్రదర్శిస్తున్న ఎంపీడీఓ

సాక్షి,యాదాద్రి : స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు అధికార యంత్రాంగం కసరత్తు వేగవంతం చేసింది. ఇప్పటికే బ్యాలెట్ పేపర్ల ముద్రణ, పోలింగ్ కేంద్రాల గుర్తింపు పూర్తికాగా ఎన్నికల సంఘం గుర్తులను కూడా ప్రకటించింది. సోమవారం జిల్లా వ్యాప్తంగా 17 మండల పరిషత్ కార్యాలయాల్లో ఎంపీటీసీ స్థానాల వారీగా ఓటరు జాబితాలను ప్రదర్శించారు. జిల్లాలో మొత్తం 178 ఎంపీటీసీ స్థానాలు, 17 జెడ్పీటీసీ స్థానాలు ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా మంగళవారం పోలింగ్ కేంద్రాల ముసాయిదా ప్రకటించి బుధవారం నుంచి అభ్యంతరాలు స్వీకరించనున్నారు.

15లోగా ఏర్పాట్లు పూర్తి చేయండి

స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి ఈనెల 15లోగా ఏర్పాట్లు పూర్తి కావాలని కలెక్టర్ హనుమంతరావు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌తో అదనపు కలెక్టర్ గంగాధర్‌తో కలిసి స్థానిక సంస్థల ఎన్నికల ఏర్పాట్లపై సమీక్షించారు. మంగళవారం (నేడు) పోలింగ్ కేంద్రాల ముసాయిదా విడుదల చేసి 12నుంచి 13వ తేదీ వరకు అభ్యంతరాలు స్వీకరించాలని, 15న తుది జాబితా ప్రదర్శించాలని సూచించారు. 13నుంచి 15వ తేదీ వరకు మూడు రోజుల పాటు పీఓలు, ఏపీఓలతో పాటు ఎన్నికల సిబ్బందికి శిక్షణ ఇవ్వాలని పేర్కొన్నారు. అధికారులు నేరుగా వెళ్లి పోలింగ్ కేంద్రాలను సందర్శించి అనువుగా ఉన్నాయా లేదా పరిశీలించాలని ఆదేశించారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సజావుగా నిర్వహించేలా సిద్ధంగా ఉండాలని కోరారు. ఏర్పాట్లలో ఏచిన్న లోపం రావద్దని, పోలింగ్ కేంద్రాలపై అభ్యంతరాలు వస్తే జాగ్రత్తగా పరిశీలించాలని సూచించారు. ఈ సమావేశంలో చౌటుప్పల్ ఆర్డీఓ కృష్ణారెడ్డి, డీపీఓ సునంద, జిల్లా పరిషత్ సీఈఓ శోభారాణి, జిల్లా విద్యాశాఖ అధికారి సత్యనారాయణ ఇతర అధికారులు పాల్గొన్నారు.

చౌటుప్పల్‌కు సాగునీరు సాధించడమే లక్ష్యం

చౌటుప్పల్ రూరల్ : చౌటుప్పల్ ప్రాంతానికి సాగునీరు సాధించడమే లక్ష్యమని తెలంగాణ జలసాధన సమితి కన్వీనర్ కట్టా భగవంత్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన చౌటుప్పల్ మండలంలోని ఎల్లగిరి, ఖైతాపురం, ఎల్లంబావి, ఎల్లగిరి, కొయ్యలగూడెం, దండుమల్కాపురం, తుప్రాన్‌పేట గ్రామాల ప్రజలతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ చౌటుప్పల్ ప్రాంతంలో సాగునీటి వనరులు లేక రైతులు, ప్రజలు దశాబ్దాలుగా ఇబ్బందులు పడుతున్నారని పర్కొన్నారు. సాగునీరు అందించడానికి అనేక అవకాశాలు ఉన్నాయని, అయినా పట్టించుకునే వారు లేరన్నారు. సాగునీటి కోసం రైతులను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామన్నారు. ఇందుకోసం త్వరలో కార్యాచరణ రూపొందిస్తామని వెల్లడించారు. సమావేశంలో మెట్టు సుదర్శన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ రిక్కల ఇందిరాసత్తిరెడ్డి, గుర్రం కొండయ్య, యాదయ్య, నాయకులు కంది లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్నేహానికన్న మిన్న లోకాన లేదు

- 'దోస్తానా' పుస్తకావిష్కరణలో సుద్దాల అశోక్‌తేజ

ఆలేరు రూరల్ : స్నేహానికన్న మిన్న లోకాన లేదని, నిజమైన స్నేహితులు ఉన్న వ్యక్తి అదృష్టవంతుడని సినీగేయ రచయిత డాక్టర్ సుద్దాల అశోక్‌తేజ అన్నారు. కాళోజీ అవార్డు గ్రహీత, ప్రముఖ చరిత్ర పరిశోధకులు శ్రీరామోజు హరగోపాల్ రచించిన దోస్తానా మినీ కవితా సంపుటిని సోమవారం ఆలేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రతి వ్యక్తి తన దోస్తులతో అమృత తుల్యమైన ఆనందనం పంచుకుంటారని పేర్కొన్నారు. హరగోపాల్ తన స్నేహితులతో ఉన్న ఐదు దశాబ్దాల అనుబంధాన్ని దోస్తాన సంపుటి ద్వారా అక్షరబద్ధం చేశారని పేర్కొన్నారు. సంపుటిలోని 150 కవితలు స్నేహం విలువలను చాటిచెబుతున్నాయన్నారు. హరగోపాల్ పరిశోధనల్లో తనకంటూ ఒక పేజీని లిఖించుకున్నారని కొనియాడారు. అదే విధంగా పుస్తక ప్రచురణ కర్త అమ్మ యాది పెండెం ఫౌండేషన్ అధ్యక్షుడు పెం సత్యనారాయణ, కవి శ్రీరామోజు హరగోపాల్, డాక్టర్ తిరునగరి శ్రీనివాస్, డాక్టర్ పోరెడ్డి రంగయ్య, పాఠశాల హెచ్ఎం దాసరి మంజుల, మేఘరాజు మాట్లాడారు. కార్యక్రమంలో నంది అవార్డు గ్రహీత, సీనియర్ జర్నలిస్టు ఎండీ అబ్దుల్, యంబ నర్సింహులు, బండిరాజుల శంకర్, ఆకవరం మోహన్‌రావు, జి.కుమారస్వామి, వంగపల్లి అంజయ్యస్వామి, దూడల వెంకటేశ్, బొమ్మకంటి బాలరాజు, ఫ్రెండ్స్ ఫర్ ఎవర్ సభ్యులు సుధాకర్, సుభాష్, జయంత్, గఫార్, సాహితీ అభిమానులు, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కవి హరగోపాల్, సుద్దాల అశోక్ తేజను పలువురు ఘనంగా సన్మానించారు.



దోస్తానా సంపుటిని ఆవిష్కరిస్తున్న సుద్దాల అశోక్‌తేజ, హరగోపాల్, పెండెం సత్యనారాయణ, తిరునగిరి శ్రీనివాస్, పోరెడ్డి రంగయ్య, మంజుల

జోరుగా నామినేషన్లు

ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి చివరి రోజు 18 మంది నామినేషన్

- మొత్తం 23 మంది 50 సెట్ల నామినేషన్లు దాఖలు
- భారీ ర్యాలీలతో హోరెత్తిన నల్లగొండ
- నేడు నామినేషన్ల పరిశీలన



ర్యాలీ నిర్వహిస్తున్న టీపీయూఎస్ శ్రేణులు



నామినేషన్ దాఖలు చేస్తున్న శ్రీపాల్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : వరంగల్ – ఖమ్మం – నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి చివరిరోజు అధిక సంఖ్యలో నామినేషన్లు దాఖలయ్యాయి. అభ్యర్థుల నుంచి రిటర్నింగ్ అధికారి, నల్లగొండ కలెక్టర్ ఇలా త్రిపాఠి నామినేషన్లు స్వీకరించారు. సోమవారం 18 మంది అభ్యర్థులు 27 సెట్ల నామినేషన్లు వేయగా.. ఇప్పటి వరకు 23 మంది 50 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. సోమవారం నామినేషన్ల స్వీకరణకు చివరి రోజు కావడంతో పెద్ద ఎత్తున సమావేశాలు, ర్యాలీలు నిర్వహించి నామినేషన్లు వేశారు. నామినేషన్ల ఘట్టం ముగియడంతో మంగళవారం వాటి పరిశీలన జరగనుంది. వాటిల్లో నిబంధనలకు అనుగుణంగా లేని నామినేషన్లను తిరస్కరిస్తారు. ఈనెల 13వ తేదీ వరకు ఉపసంహరణకు అవకాశం ఉంది. ఆ తరువాత పోటీలో ఉండే అభ్యర్థులు ఖరారు కానున్నారు. ఈనెల 27న పోలింగ్ జరుగనుంది. మార్చి 3న కౌంటింగ్ ప్రారంభం కానుంది. ఇందుకు అవసరమైన ఏర్పాట్లపై అధికార యంత్రాంగం దృష్టి పెట్టింది.

సమావేశాలు, ర్యాలీలు

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నామినేషన్ల ప్రక్రియ ఈ నెల 3వ తేదీన ప్రారంభమైంది. అప్పటి నుంచి సోమవారం వరకు నామినేషన్ల ప్రక్రియ కొనసాగింది. ఇంతకుముందే నామినేషన్లు వేసిన వారు కూడా సోమవారం పెద్దఎత్తున సమావేశాలు, ర్యాలీలు నిర్వహించి మరోసెట్ దాఖలు చేశారు. అందులో ప్రధాన సంఘాల మద్దతు కలిగిన అభ్యర్థులైన పింగిళి శ్రీపాల్‌రెడ్డి, పులి సరోత్తమ్‌రెడ్డి, పూల రవీందర్, ఎస్.సుందర్‌రాజు యాదవ్ తదితరులు నామినేషన్ పత్రాలను సమర్పించారు. పూల రవీందర్ బహుజన వాదంతో పెద్ద ఎత్తున ఎన్జీ కాలేజీ నుంచి ర్యాలీగా వెళ్లి నామినేషన్ వేయగా, పీఆర్‌టీయూ-టీఎస్ అభ్యర్థి పింగిళి శ్రీపాల్‌రెడ్డి కూడా ఎన్జీ కాలేజీ నుంచి ర్యాలీగా వెళ్లి నామినేషన్ దాఖలు చేశారు. అలాగే బీజేపీ అభ్యర్థిగా, టీపీయూఎస్ మద్దతుతో పులి సరోత్తంరెడ్డి భారీ ర్యాలీగా వచ్చి నామినేషన్ సమర్పించారు. సుందర్‌రాజు యాదవ్ వాహనాల్లో ర్యాలీగా వచ్చి నామినేషన్ వేశారు. అయితే సుందర్‌రాజుయాదవ్, పూల రవీందర్ నామినేషన్ కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నతో పాటు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు. బీజేపీ అభ్యర్థి సరోత్తంరెడ్డి నామినేషన్ కార్యక్రమంలో కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి, ఎమ్మెల్సీ ఏవీఎన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ధర్మారావు తదితరులు పాల్గొన్నారు. టీఎస్ యూటీఎఫ్ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, టీచర్స్ జేఏసీ అభ్యర్థి, టీపీసీసీ అధికార ప్రతినిధి గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి గతంలోనే పెద్ద ఎత్తున ర్యాలీలు నిర్వహించి నామినేషన్లు దాఖలు చేశారు. ఇక చివరి రోజు కూడా హర్షవర్ధన్‌రెడ్డి తరఫున ఆయన కూతురు హేమంత సంధ్యారెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. ఇలా మొత్తంగా 23 మంది 50 సెట్ల నామినేషన్లు వేశారు.

అభ్యర్థుల వారీగా నామినేషన్లు వేసిన సెట్ల సంఖ్య

అభ్యర్థి	సెట్లు
అలుగుబెల్లి నర్సిరెడ్డి	3
పులి సరోత్తంరెడ్డి	3
పింగిళి శ్రీపాల్‌రెడ్డి	4
పూల రవీందర్	3
గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి	2
ఎస్.సుందర్‌రాజు	3
తాటికొండ వెంకటరాజయ్య	1
ఏలె చంద్రమోహన్	3
దామర బాబురావు	3
లింగిడి వెంకటేశ్వర్లు	4
బంక రాజు	2
పన్నాల గోపాల్‌రెడ్డి	2
ఔరశ స్వాతి	1
చకిలం చంద్రశేఖర్	2
తలకొప్పల పురుషోత్తంరెడ్డి	3
కొలిపాక వెంకటస్వామి	3
కాటే సాయన్న	1
జంగిటి కైలాసం	1
జెట్టి శంకర్	1
బోండా నాగరాజు	2
కోమటిరెడ్డి గోపాల్‌రెడ్డి	1
గండిరెడ్డి కోటిరెడ్డి	1
తండు ఉపేందర్	1

13 వరకు ఉపసంహరణ

ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి సంబంధించి నామినేషన్ల ప్రక్రియ పూర్తయినందున బుధ, గురువారాల్లో నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం కల్పించారు. 13వ తేదీన 3 గంటల్లోగా నామినేషన్లు ఉపసంహరించుకునేందుకు అవకాశం ఉంది. ఆ తర్వాత పోటీలో ఉండే అభ్యర్థులను ప్రకటిస్తారు.

జోరందుకోనున్న ప్రచారం

నామినేషన్ల ప్రక్రియ పూర్తయినందున ప్రచార ఘట్టం ప్రారంభం కానుంది. ఇప్పటికే అన్ని సంఘాలు క్షేత్ర స్థాయిలో ఓ దఫా ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించాయి. ఇకపై మరింత జోరుగా ప్రచారాన్ని కొనసాగించనున్నాయి. ఈ ఎన్నికల్లో ప్రధాన సంఘాల అభ్యర్థులతో పాటు బహుజన వాదంతో ముందుకు వస్తున్న అభ్యర్థులు, బీజేపీ అభ్యర్థి, ఇతర స్వతంత్ర అభ్యర్థులు తమ ప్రచార కార్యక్రమాన్ని మరింత ముమ్మరం చేయనున్నారు.

క్లుప్తంగా

చిలుకూరు ఎమ్మార్సీ కార్యాలయంలో చోరీ


చోరీ జరిగిన గదిని పరిశీలిస్తున్న పోలీసులు, ఎంఈఓ

చిలుకూరు: చిలుకూరు మండల కేంద్రంలోని బస్టాండ్ సెంటర్‌లో గల ఎమ్మార్సీ కార్యాలయంలో ఆదివారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. కార్యాలయం తాళం పగలగొట్టి రెండు కంప్యూటర్ల సీపీయూలు ఎత్తుకెళ్లారు. సోమవారం ఉదయం కార్యాలయం శుభ్రం చేసేందుకు వచ్చిన స్వీపర్ దొంగతనం జరిగినట్లుగా గుర్తించి ఎంఈఓ గురవయ్య తెలియజేయడంతో ఆయన వెంటనే స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో ఎంఈఓతోపాటు పోలీసులు ఘటన స్థలానికి వచ్చి పరిశీలించారు. ఎమ్మార్సీ కార్యాయలంలో లోపలికి వెళ్లేదారి పక్కన వీరాంజనేయ స్వామి దేవాలయంలో ఉన్న సీసీ కెమెరాలను పోలీసులు పరిశీలిస్తున్నారు. చోరీ జరిగిన తీరుపై విచారణ చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

వ్యక్తి అదృశ్యం

దేవరకొండ: దేవరకొండ పట్టణానికి చెందిన పండ్ల వ్యాపారి మహ్మద్ ఇబ్రహీం అదృశ్యమైనట్లు దేవరకొండ సీఐ నర్సింహులు తెలిపారు. సీఐ తెలిపిన వివరాలు.. ఇబ్రహీం స్థానికంగా పండ్ల వ్యాపారం చేస్తూ కుటుంబ సభ్యులతో జీవిస్తున్నాడు. సోమవారం ఉదయం పట్టణంలోని బస్టాండ్ వద్ద తన ద్విచక్ర వాహనాన్ని నిలిపి ఉంచాడు. అనంతరం తన భార్యకు ఫోన్ చేసి బైక్ కవర్‌లో సూసైడ్ లెటర్ ఉంచి వెళ్లిపోయినట్లు సీఐ తెలిపారు. కొంతకాలంగా హరిలాల్ అనే వ్యక్తితో ఆర్థిక లావాదేవీలు ఉన్నట్లు లెటర్‌లో రాసి ఉంచాడు. ఇబ్రహీం భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

బైక్ ఢీ.. ఒకరు దుర్మరణం


మల్లేష్ మృతదేహం

బొమ్మలరామారం: బైక్ ఢీ కొట్టడంతో వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. ఈ సంఘటన బొమ్మలరామారం మండలంలో సోమవారం చోటుచేసుకుంది. బొమ్మలరామారం పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ శ్రీశైలం తెలిపిన వివరాల ప్రకారం.. తుర్కపల్లి మండలం వాసాలమర్రికి చెందిన గుంటి మల్లేష్ (57) దంపతులు గ్రామాల్లో జరిగే జాతర్లలో బొమ్మలు, పూసల దండలను విక్రయించి జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో మండలంలోని చౌదర్‌పల్లి గ్రామంలో సోమవారం జరుగుతున్న భ్రమరాంభ మల్లిఖార్జున స్వామి జాతరలో మల్లేష్ దంపతులు దండలు, బొమ్మలు అమ్ముతున్నారు. మల్లేష్ తన భార్యను జాతరలో ఉంచి పని నిమిత్తం మండలంలోని చీకటిమామిడికి నడుచుకుంటు వస్తున్నాడు. ఈ క్రమంలో చీకటిమామిడి వైపు వెళ్తున్న బైక్ మల్లేష్‌ను ఢీ కొట్టింది. తీవ్ర గాయాలైన మల్లేష్ సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ దేవేందర్ తెలిపారు.

టీచర్ ఎమ్మెల్సీలుగా మనోళ్లు

నల్లగొండ జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించిన ధర్మారెడ్డి, రవీందర్, నర్సిరెడ్డి


ధర్మారెడ్డి (ఫైల్)


పూల రవీందర్


అలుగుబెల్లి నర్సిరెడ్డి

నార్కట్‌పల్లి, నల్లగొండ : వరంగల్–ఖమ్మం–నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గానికి నాలుగు సార్లు ఎన్నికలు జరగ్గా మూడుసార్లు నల్లగొండ జిల్లా నుంచే ఉపాధ్యాయ ఎమ్మెల్సీలుగా ఉన్నారు. 1982, 2013, 2019లో జరిగిన ఎన్నికల్లో ముగ్గురూ జిల్లాకు చెందిన వారే ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. 2006 జరిగిన ఎన్నికల్లో మాత్రం వరంగల్ జిల్లాకు చెందిన చుక్కా రామయ్య గెలుపొందారు.

తొలిసారి ధర్మారెడ్డి..

వరంగల్–ఖమ్మం–నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గం నుంచి 1982లో బీరవెల్లి ధర్మారెడ్డి గెలుపొందారు. ఆయన స్వగ్రామం నార్కట్‌పల్లి మండలం మాండ్ర. బీరవెల్లి రాంరెడ్డి–పిచ్చమ్మ దంపతులకు ప్రథమ సంతానంగా 1944 ఏప్రిల్ 10న జన్మించిన ధర్మారెడ్డి బీఏ, బీఈడీ వరకు ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలో విద్యాభ్యాసం చేశారు. అనంతరం 1963 సెప్టెంబర్ 11న స్కూల్ అసిస్టెంట్ ఉద్యోగం సాధించి ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని తాళ్లసింగారం, అయిటిపాముల, చిట్యాల, పెద్దకాపర్తి, సూర్యాపేట, పోచంపల్లి, అడవిదేవులపల్లిలో ఉపాధ్యాయుడిగా పనిచేశారు. ఆ సమయంలోనే 1971లో స్థాపించిన పీఆర్‌టీయూ (పంచాయతీ రాజ్ టీచర్స్ యూనియన్)లో వ్యవస్థాపక సభ్యుడు. ఆ తర్వాత 1976 నుంచి 1981 వరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేశారు. అనంతరం 1982లో వీఆర్‌ఎస్ తీసుకుని వరంగల్ –ఖమ్మం –నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గ అభ్యర్థిగా పోటీచేసి చుక్కా రామయ్యపై గెలుపొందారు. అయితే టీడీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి సీఎం ఎన్‌టీఆర్ 1984లో శాసన మండలిని రద్దు చేయడంతో ధర్మారెడ్డి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పదవిని కోల్పోయారు.

❖ 2004లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక అప్పటి సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి శాసన మండలిని తిరిగి పునరుద్ధరించడంతో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా 2006లో మరోసారి పోటీ చేసిన ధర్మారెడ్డి ఆ ఎన్నికల్లో చుక్కా రామయ్య చేతిలో ఓటమి పాలయ్యారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషిచేసిన వ్యక్తిగా గుర్తింపు పొందిన ధర్మారెడ్డి 69 ఏళ్ల వయస్సులో 2014లో అనా రోగ్యంతో తుది శ్వాస విడిచినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

2013లో పూల రవీందర్..

ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి 2013లో జరిగిన ఎన్నికల్లో కేతేపల్లి మండలం చెరుకుపల్లి గ్రామానికి చెందిన పీఆర్‌టీయూ తరఫున పోటీ చేసి పూల రవీందర్ విజయం సాధించారు. ఆయన పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడిగా, రాష్ట్ర అధ్యక్షుడిగా పని చేశారు. ఉపాధ్యాయ పదవికి రాజీనామా చేసి 2013లో జరిగిన ఎన్నికల్లో పీఆర్‌టీయూ తరఫున విజయం సాధించి 2019 వరకు పదవిలో ఉన్నారు. 2019లో జరిగిన ఎన్నికల్లో తిరిగి పీఆర్‌టీయూ నుంచి పోటీ చేసి ఓడిపోయారు.

2019లో అలుగుబెల్లి నర్సిరెడ్డి

2019లో జరిగిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మాడ్గులపల్లి మండలం చర్లగూడెం గ్రామానికి చెందిన అలుగుబెల్లి నర్సిరెడ్డి యూటీఎఫ్ నుంచి పోటీ చేసి విజయం సాధించారు. ఆయన ఉపాధ్యాయుడిగా కొనసాగుతూనే యూటీఎఫ్‌లో జిల్లా ప్రధాన కార్యదర్శిగా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. 2019 ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేసేందుకు యూటీఎఫ్ అవకాశం కల్పించింది. ఆ ఎన్నికల్లో పీఆర్‌టీయూ అభ్యర్థి పూల రవీందర్‌పై నర్సిరెడ్డి విజయ సాధించారు. ప్రస్తుతం ఎమ్మెల్సీగా కొనసాగుతున్నారు. ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల్లో ఆ సంఘం తరఫున రెండో సారి పోటీ చేస్తున్నారు.

బీసీ అభ్యర్థి గెలుపు ఖాయం


పూల రవీందర్‌కు మద్దతుగా ర్యాలీలో పాల్గొన్న తీన్మార్ మల్లన్న, జాజుల శ్రీనివాస్‌గౌడ్


తీన్మార్ మల్లన్న, శ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి నామినేషన్ అందజేస్తున్న సుందర్‌రాజు యాదవ్

- బీసీలపై కుట్రలను తిప్పికొట్టాలి
- ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్

నల్లగొండ: వరంగల్–ఖమ్మం–నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీ అభ్యర్థి గెలుపు ఖాయమని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, బీసీ సంక్షేమ జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. 24 వేల ఓట్లలో 20 వేల ఓట్లు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలవేనని.. ఈసారి మా ఓట్లు మేమే వేసుకుని విజయం సాధిస్తామన్నారు. సోమవారం వారు నల్లగొండలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థుల నామినేషన్ల దాఖలులో పూల రవీందర్, సుందర్‌రాజు యాదవ్‌కు మద్దతుగా పాల్గొన్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. త్వరలో బీసీ సభలు పెట్టబోతున్నామని చెప్పారు. ఈ ఎన్నికల్లో బీసీ బిడ్డ గెలుపును ఎవరూ అడ్డుకోలేరని అన్నారు. బీసీ ముఖ్యమంత్రి కావడం ఈ ఎన్నికలు ఎంతో కీలకమని అన్నారు. ఈ ఎన్నికల్లో నలుగురు ఓసీలు, ఇద్దరు బీసీలు ప్రధాన అభ్యర్థులుగా పోటీ చేస్తున్నారని అన్నారు. బీసీ ఓట్లు చీలకుండా మొదటి ఓటు , రెండో ఓటు 2 ఓట్లు కూడా బీసీ అభ్యర్థులకే వేయాలన్నారు. రాజకీయంగా బీసీలపై జరుగుతున్న కుట్రలను తిప్పికొట్టాలన్నారు. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చిరంజీవి మాట్లాడుతూ ఇప్పుడు ఎమ్మెల్సీ ఎన్నికలు తెలంగాణ దశ దిశను మార్చే ఎన్నికలని అన్నారు. బడుగు, బలహీన వర్గాలకు రాజ్యాధికార సాధనలో ఈ ఎన్నికలు తొలి మెట్టు అవుతాయన్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థి పూల రవీందర్ మాట్లాడుతూ ఎమ్మెల్సీగా ఎన్నో సమస్యలు పరిష్కరించానని, మరోసారి తనను ఆశీర్వదించాలన్నారు. మరో అభ్యర్థి సుందర్‌రాజు యాదవ్ మాట్లాడుతూ ఉపాధ్యా ఎమ్మెల్సీ ఎన్నిక బీసీల ఆత్మగౌరవానికి ప్రతీక కాబోతుందన్నారు. తన గెలుపుతో ఈడబ్ల్యూఎస్ కోటా రద్దు కాబోతుందన్నారు. కుల గణన తప్పు అంటూ నిరూపించుకోవాలంటే తనకు ఓటేయాలని కోరారు.

ఎమ్మెల్సీగా సరోత్తమ్‌రెడ్డిని గెలిపించుకుందాం

- కామారెడ్డి ఎమ్మెల్యే కాటేపల్లి వెంకటరమణారెడ్డి


కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డితో కలిసి నామినేషన్ అందజేస్తున్న పులి సరోత్తమ్‌రెడ్డి

నల్లగొండ, నల్లగొండ టూటౌన్: వరంగల్–ఖమ్మం – నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ బలపర్చిన అభ్యర్థి పులి సరోత్తమ్‌రెడ్డిని గెలిపించుకుందామని కామారెడ్డి ఎమ్మెల్యే కాటేపల్లి వెంకటరమణారెడ్డి అన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పోటీచేస్తున్న పులి సరోత్తమ్‌రెడ్డి నామినేషన్ సందర్భంగా సోమవారం నల్లగొండలోని ఎస్‌ఆర్ గార్డెన్‌లో బీజేపీ కార్యకర్తలు, పలువురు ఉపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉపాధ్యాయులకు పీఆర్సీ ఇవ్వకుండా మోసం చేసిందన్నారు. సరోత్తమ్‌రెడ్డిని గెలిపిస్తే ఉపాధ్యాయుల సమస్యలపై మండలిలో పోరాడుతారని తెలిపారు. ఎమ్మెల్సీ అభ్యర్థి సరోత్తమ్‌రెడ్డి మాట్లాడుతూ తనను ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గెలిపిస్తే ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానన్నారు. అనంతరం నామినేషన్ వేయడానికి ఎస్‌ఆర్ గార్డెన్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీగా వెళ్లారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి, భువనగిరి మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, నాయకులు కాసం వెంకటేశ్వర్లు, ప్రేమేందర్‌రెడ్డి, శ్రీనివాస్, వీరెల్లి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్ల సంఖ్య 25,797

నల్లగొండ : వరంగల్–ఖమ్మం–నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్లు పెరిగారు. డిసెంబరు 30న ప్రకటించిన జాబితా ప్రకారం ఉపాధ్యాయ ఓటర్లు 24,905 మంది ఉన్నారు. అయితే నామినేషన్ల వరకు కూడా ఓటు నమోదుకు అవకాశం కల్పించారు. దీంతో మరో 892 మంది ఓటర్లు కొత్తగా ఓటు నమోదు చేసుకున్నారు. తుది ఓటరు జాబితాకు ఈ సప్లిమెంటరీ జాబితా జత చేశారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గంలో మొత్తం 25,797 మంది ఓటర్లు ఉన్నారు.

జిల్లా	పురుషులు	స్త్రీలు
సిద్దిపేట	123	43
జనగామ	614	388
హన్మకొండ	2943	2272
వరంగల్	1474	878
మహబూబాబాద్	1112	551
భూపాలపల్లి	215	114
ములుగు	405	223
భద్రాద్రి	1068	954
ఖమ్మం	2372	1717
భువనగిరి	638	346
సూర్యాపేట	1702	962
నల్లగొండ	2817	1866
మొత్తం	15,483	10,314

డ్రెయినేజీ గుంతలోకి దూసుకెళ్లిన కారు


కారును బయటకు లాగుతున్న పోలీసులు, స్థానికులు

చౌటుప్పల్: చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కార్యాలయం ప్రధాన ద్వారం ముందు నిలిచిపోయిన డ్రెయినేజీ కాలువలోకి సోమవారం ఓ కారు దూసుకెళ్లింది. స్థానికంగా అండర్‌పాస్ బ్రిడ్జి నిర్మాణంలో భాగంగా సర్వీస్‌రోడ్లకు ఇరువైపులా డ్రెయినేజీ నిర్మాణాలు చేపడుతున్నా ఎక్కడా ఎలాంటి రక్షణ చర్యలుగాని, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయలేదు. దీంతో అటుగా వచ్చిన కారు టర్నింగ్ తీసుకునే క్రమంలో పక్కనే ఉన్న డ్రెయినేజీ గుంతలోకి దూసుకెళ్లింది. పూర్తిగా నీటిలోకి వెళ్లకుండా కొంతదూరం వరకు వెళ్లి ఆగిపోయింది. ట్రాఫిక్ పోలీసులు, స్థానికులు కలిసి కారును బయటకు లాగారు. దీంతో కారులోని వ్యక్తులకు ఎలాంటి ప్రమాదం జరుగలేదు. ఇప్పటికైనా నిర్మాణ కాంట్రాక్టర్ ఇలాంటి ప్రమాదాల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

రవీంద్రనాథ్‌కు టాలెంట్ అవార్డు


అవార్డు అందుకుంటున్న రవీంద్రనాథ్

అడవిదేవులపల్లి: అడవిదేవులపల్లికి చెందిన కూరాకుల రవీంద్రనాథ్‌కు ఇంటర్నేషనల్ ఫెస్టివల్ టాలెంట్ అవార్డు దక్కింది. ధర్మచక్రం మూవీలో అచ్చంనాయుడు క్యారెక్టర్ చేసినందుకు బెస్ట్ ఇమిటేడెడ్ ఆర్టిస్ట్ అవార్డు వరించింది. అయితే రవీంద్రనాథ్ ఇప్పటి వరకు ఎనిమిది సినిమాల్లో నటించారు. హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో రేలంగి నర్సింహారావు, శ్రీనివాసచారి, వంశీకృష్ణ చేతుల మీదుగా రవీంద్రనాథ్ ఇంటర్నేషనల్ ఫెస్టివల్ టాలెంట్ అవార్డును అందుకున్నారు.

పూర్వగిరిలో కల్యాణ వైభోగం


కల్యాణ వేడుకను తిలకిస్తున్న భక్తులు


మంగళ సూత్రాన్ని చూపెడుతున్న ఆలయ ప్రధానార్చకులు


పట్టు వస్త్రాలు అందజేస్తున్న కలెక్టర్ హనుమంతరావు దంపతులు, పక్కన అనువంశిక ధర్మకర్త నర్సింహమూర్తి

- పాంచరాత్ర ఆగమశాస్త్రానుసారంగా శ్రీస్వామి అమ్మవార్ల పరిణయ వేడుక
- నేడు దివ్య విమాన రథోత్సవం

యాదగిరిగుట్ట: శ్రీపూర్వగిరి లక్ష్మీనరసింహస్వామి కల్యాణం సోమవారం రాత్రి పాంచరాత్ర ఆగమశాస్త్రానుసారంగా వైభవంగా జరిగింది. ఈ వేడుకలో గజవాహనంపై శ్రీనృసింహస్వామి, పల్లకిపై శ్రీలక్ష్మీ అమ్మవారలను పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో అర్చకులు ముస్తాబు చేసి పురవీధుల్లో ఊరేగిస్తూ కల్యాణ మండపానికి తీసువచ్చి కల్యాణ తంతును నిర్వహించారు. ఉదయం శ్రీస్వామి వారిని హనుమంత వాహనంపై తిరువీధి సేవ నిర్వహించారు. ఆయా వేడుకల్లో ఈఓ భాస్కర్‌రావు, అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి, ఆలయాధికారులు, ప్రధానాచార్యులు, ఉప ప్రధానార్చకులు, ఆచార్యులు పాల్గొన్నారు.

పురవీధుల్లో ఊరేగుతూ..

శ్రీస్వామి వారు పట్టు పీతాంబారాలను, బంగారు, నవరత్నములను పొదిగిన ఆభరణాములను ధరించి నవవరుడిగా.. అమ్మవారు దివ్యాలంకార శోభితమై ప్రత్యేక పల్లకి సేవలో శ్రీస్వామి వారిని అనుసరించగా ఆలయ పుర వీధుల్లో ఊరేగింపు సేవ సాగింది. అనంతరం కల్యాణ వేదికకు లక్ష్మీ నారసింహుల సేవ చేరింది. ప్రత్యేక పూజల అనంతరం ఆచార్యులు శ్రీస్వామికి జంధ్యధారణ చేసి వేద మంత్ర పఠనంతో శ్రీవారు అమ్మవారికి, అమ్మవారు శ్రీవారికి జీలకర బెల్లం పెట్టి శిరస్సున అలంకరించిన తంతు కనులపండువగా జరిపించారు. అనంతరం మంగళవాయిద్యాల నడుమ లోక నాయకుడు శ్రీనృసింహుడు శ్రీలక్ష్మీ అమ్మవారి మెడలో మాంగళ్యధారణ గావించారు.

ఉదయం హనుమంత వాహనంపై..

ఉదయం 8గంటలకు పారాయణీకులచే నిత్య ప్రబంధ పారాయణములు, యాజ్ఞీకులచే నిత్య హవనములు, మూల, మూర్తిమంత్ర అనుష్టానములు, హవనం పూజలు జరిగాయి. అనంతరం శ్రీస్వామి వారికి, అమ్మవారికి వేదమంత్ర మధ్య తిరుమంజన మహోత్సవం నిర్వహించారు. శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారలను వైభవంగా హనుమంత వాహనసేవలో ఊరేగించారు. ఆస్థాన మండపంలో హనుమంతవాహనంపై అధిష్ఠింపజేసిన శ్రీస్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు.

నేడు రథోత్సవం..

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయంలో మంగళవారం ఉదయం 8గంటలకు హవనం పూజలు నిర్వహిస్తారు. అనంతరం గరుఢ వాహనంపై శ్రీస్వామి వారిని ఊరేగిస్తారు. రాత్రి 8గంటలకు శ్రీస్వామి వారి రథోత్సవాన్ని జరిపిస్తారు.

గంజాయి సేవిస్తున్న ఇద్దరి అరెస్ట్

చౌటుప్పల్: గంజాయి సేవిస్తున్న ఇద్దరు వ్యక్తులను సోమవారం అరెస్ట్ చేశామని చౌటుప్పల్ సీఐ మన్మథకుమార్ తెలిపారు. చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని దివీస్ పరిశ్రమ సమీపంలోని ఇతర పరిశ్రమల్లో పనిచేసే ఇద్దరు వ్యక్తులు రహస్యంగా గంజాయి తెచ్చుకొని సేవిస్తున్నారు. విషయం తెలుసున్న పోలీసులు ఘటనాస్థలానికి వెళ్లి ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. వారివద్ద నుంచి 50గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నామని సీఐ పేర్కొన్నారు.

మూర్ఛ రావడంతో కిందపడి వ్యక్తి మృతి


మృతుడు మధుకర్

చౌటుప్పల్: నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తికి అకస్మాత్తుగా మూర్చ రావడంతో కిందపడి మృతిచెందాడు. ఈ ఘటన చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని లింగోజిగూడెం గ్రామ శివారులో సోమవారం చోటుచేసుకుంది. సీఐ మన్మథకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని ఉప్పల్ పరిధి శ్రీనగర్‌కాలనీలోని బీరప్పగడ్డ ప్రాంతానికి చెందిన పండిట్ మధుకర్(43) ప్రస్తుతం ఖాళీగా ఉంటున్నాడు. తల్లిదండ్రులతో కలిసి ఆదివారం హయత్‌నగర్‌లోని ఓ చర్చికి ప్రార్థన చేసేందుకు వెళ్లాడు. తల్లిదండ్రులు ప్రార్థన చేస్తుండగా మధుకర్ వారికి చెప్పకుండా బయటకు వచ్చాడు. మానసికస్థితి సరిగా లేని అతను నడుచుకుంటూ లింగోజిగూడెం వరకు వచ్చినట్టుగా భావిస్తున్నారు. ఆ క్రమంలో నడుచుకుంటూ వెళ్తుండగా అండర్‌పాస్ బ్రిడ్జి వద్దకు చేరుకోగానే అకస్మాత్తుగా మూర్చవచ్చింది. దాంతో అతను ఒక్కసారిగా కిందపడి అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికుల సమాచారంతో పోలీసులు వచ్చి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు జరుపుతున్నామని సీఐ పేర్కొన్నారు.

23న మహాకుంభ సంప్రోక్షణ

- సిద్ధమవుతున్న యాదగిరి క్షేత్రం
- 19 నుంచి నారసింహ హోమం
- ఆలయ ఈఓ భాస్కర్‌రావు వెల్లడి


ఆలయ ఉత్తర మాఢ వీధిలో శ్రీనారసింహ హోమానికి ఏర్పాటు చేస్తున్న యాగశాల

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయ దివ్య విమాన స్వర్ణ గోపురానికి ఈనెల 23న ఉదయం 11:54 గంటలకు మహాకుంభ సంప్రోక్షణ నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ భాస్కర్‌రావు పేర్కొన్నారు. సోమవారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. గోపురానికి స్వర్ణ తాపడం పనులు ఈ నెల 14వ తేదీ వరకు పూర్తి కానున్నట్లు తెలిపారు. ఈ నెల 19వ తేదీ నుంచి 23వ తేదీ వరకు మహాకుంభ సంప్రోక్షణ పూజలు వేద పండితులు ముహూర్తంగా నిర్ణయించినట్లు పేర్కొన్నారు. 5 రోజుల పాటు ఈ మహాకుంభ సంప్రోక్షణ పూజల్లో భాగంగా శ్రీనారసింహ హోమాన్ని జరపనున్నట్లు తెలిపారు. దేశంలోనే అతిపెద్దదిగా 50.5అడుగుల పంచతల విమాన గోపురానికి స్వర్ణ తాపడం పనుల కోసం 65కిలోల బంగారాన్ని వినియోగించామన్నారు. ఇప్పటికే కుంభమేళా నుంచి గంగా, యమునా, సరస్వతి, గోదావరి, కృష్ణ జలాలను మహాకుంభ సంప్రోక్షణకు ఆలయానికి తీసుకొచ్చినట్లు వివరించారు.

వానమామలై జీయర్‌స్వామి సమక్షంలో పూజలు..

ఈ నెల 19వ తేదీన నుంచి 23వ తేదీ వరకు జరగనున్న శ్రీస్వామి వారి దివ్య విమాన స్వర్ణ గోపురానికి మహాకుంభ సంప్రోక్షణ క్రతువును నిర్వహిస్తారన్నారు. ఇందుకు తమిళనాడులోని నన్గునేరిలో గల వానమామలై పీఠాధిపతులు వానమామలై మధుర కవి శ్రీరామానుజ జీయర్ స్వామిజీ పర్యవేక్షణలో ఆయన శిష్య బృందం, అర్చకులు పూజలను నిర్వహించనున్నారని పేర్కొన్నారు. భక్తులు వీక్షించేలా కలెక్టర్ హనుమంతరావు సహకారంతో కొండపైన నాలుగు మాఢ వీధుల్లో, కొండపైకి రాలేని భక్తుల కోసం బస్టాండ్, కమాన్, వ్రత మండపం వద్ద ఎల్‌ఈడీ స్క్రీన్లను ఏర్పాటు చేయనున్నట్లు ఈఓ వెల్లడించారు. మహా కుంభ సంప్రోక్షణ వేడుకలో లక్ష మంది భక్తులకు ఉచితంగా పులిహోర అందజేసేందుకుఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. అంతేకాకుండా విమాన గోపురానికి దేవస్థానం నుంచే కాకుండా నగదు, బంగారం విరాళ దాతలందరికీ ఆహ్వానాలు అందించనున్నట్లు ఈఓ తెలిపారు.

పెద్దగట్టు జాతరకు పోదాం ఇలా..

- 16వ తేదీ నుంచి హైవే–65పై వాహనాల మళ్లింపు
- వాహనాల పార్కింగ్‌కు ఐదుచోట్ల స్థలాలు
- పోలీసులకు సహకరించాలి : ఎస్పీ

సూర్యాపేట టౌన్: రాష్ట్రంలో రెండవ అతిపెద్దదైన సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలం దురాజ్‌పల్లిలోని శ్రీలింగమంతుల స్వామి (పెద్దగట్టు) జాతర ఈనెల 16వ తేదీ నుంచి జరగనున్న నేపథ్యంలో తెల్లవారుజాము నుంచే జాతీయ రహదారి–65పై వాహనాల మళ్లింపునకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వాహనాల మళ్లింపు, జాతరకు వచ్చే వాహనాల పార్కింగ్ స్థలాలకు సంబంధించి రూట్ మ్యాప్‌లను సిద్ధం చేశామని పేర్కొన్నారు. జాతర సందర్భంగా రోజూ 24 గంటలు పోలీస్ బందోబస్తు నిర్వహిస్తామని తెలిపారు. భక్తులు పోలీసులకు సహకరించాలని కోరారు.

వాహనాల మళ్లింపు..

❖ **నార్కట్‌పల్లి వద్ద :** హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్లే వాహనాలను నార్కట్‌పల్లి వద్ద నల్లగొండ వైపు మళ్లించి నల్గొండ, మిర్యాలగూడ, హుజూర్‌నగర్, కోదాడ మీదుగా విజయవాడ వెళ్లాలి.

❖ **కోదాడ వద్ద :** విజయవాడ నుంచి హైదరాబాద్ వెళ్లే వాహనాలను కోదాడ వద్ద మళ్లించి హుజూర్‌నగర్, నేరేడుచర్ల, మిర్యాలగూడ, నల్లగొండ, నార్కట్‌పల్లి మీదుగా హైదరాబాద్ మళ్లిస్తారు.

❖ హైదరాబాద్ నుంచి ఖమ్మం వెళ్లే వాహనాలను టేకుమట్ల వద్ద జాతీయ రహదారి 365 మీదుగా వెళ్లాలి.

సూర్యాపేట–కోదాడ వెళ్లే వాహనాల మళ్లిపు

❖ కోదాడ, మునగాల, గుంపుల మీదుగా సూర్యాపేట పట్టణానికి వచ్చే ఆర్‌టీసీ బస్సులు, ఇతర చిన్న ప్రజా రవాణా వాహనాలు ఎస్‌ఆర్‌ఎస్‌పీ కెనాల్ నుంచి బీబిగుడెం వద్ద నుంచి సూర్యాపేటకు వెళ్లాలి.

❖ సూర్యాపేట పట్టణం నుంచి కోదాడ వెళ్లే ఆర్‌టీసీ బస్సులు, ఇతర వాహనాలు కుడకుడ గ్రామం మీదుగా ఐలాపురం వద్ద ఖమ్మం జాతీయ రహదారి మీదుగా రాఘవపురం స్టేజి నుంచి నామవరం గ్రామం మీదుగా గుంజలూరు స్టేజి వద్ద జాతీయరహదారి–65 మీదుగా కోదాడ, విజయవాడ వైపు వెళ్లాలి.

పార్కింగ్ స్థలాల ఏర్పాటు ఇలా..

మొదటి పార్కింగ్ ప్రదేశం : సూర్యాపేట మీదుగా జాతరకు వచ్చే భక్తుల వాహనాలను జాతీయ రహదారి–65 మీద గల హెచ్‌పీ పెట్రోల్ బంక్ నుంచి రాంకోటి తండాకు వెళ్లేమార్గంలో ద్విచక్ర వాహనాలు, కార్లు, ఆటోలు, ట్రాక్టర్లు, ఇతర వాహనాల కోసం పార్కింగ్ స్థలం ఏర్పాటు చేశారు.

రెండవ పార్కింగ్ ప్రదేశం : గరిడేపల్లి, పెన్‌పహాడ్ వైపుగా జాతరకు వచ్చే భక్తుల వాహనాలను పాత కలెక్టరేట్ వెనుక స్థలంలో పార్కింగ్ చేయాలి.

మూడవ పార్కింగ్ ప్రదేశం : కోదాడ, మునగాల, గుంపుల వైపుగా వచ్చే భక్తుల వాహనాలను ఖాసీంపేట గ్రామం వెళ్లే మార్గంలో పార్కింగ్ చేయాలి.

నాలుగవ పార్కింగ్ ప్రదేశం : మోతె, చివ్వెంల మండల కేంద్రాల మీదుగా జాతరకు వచ్చే భక్తుల వాహనాలకు చివ్వెంల మీదుగా మళ్లించి మున్యానాయక్‌తండా వద్ద (గట్టుకు వెనకాల) పార్కింగ్ స్థలం కేటాయించారు.

తేనెటీగల దాడిలో ఒకరు మృతి


ప్రభాకర్ (ఫైల్)

నకిరేకల్: తేనెటిగల దాడిలో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన నకిరేకల్ మండలం ఆర్లగడ్డగూడెంలో సోమవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నకిరేకల్ మండలం తాటికల్ శివారులోని ఆర్లగడ్డగూడేనికి చెందిన పిడుగు ప్రభాకర్(53) మరో ముగ్గురు కూలీలతో కలిసి కట్టెకొట్టేందుకు గ్రామ శివారులో వెళ్లారు. సర్కార్ కంపచెట్లను కొట్టెక్రమంలో తేనెటీగలు లేచి వీరిపై దాడి చేశాయి. మిగతావారు తప్పించుకోగా ప్రభాకర్ గాయపడి అపస్మారక స్థితిలో వెళ్లాడు. అతన్ని నకిరేకల్ ఏరియా ఆసుపత్రికి తరలించగా మృతి చెందినసట్లు వైద్యులు గుర్తించారు. మృతుడికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. మృతదేహాన్ని నకిరేకల్ ఎమ్మెల్యే వీరేశం, మాజీ ఎమ్మెల్యే లింగయ్య సందర్శించి నివాళులర్పించారు.